క్లుప్తంగా

నేడు అండర్-14, 17 క్రీడా పోటీలు

యద్దనపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14,17 బాలబాలికలకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.రాఘవరెడ్డి , మండల కో ఆర్డినేటర్ ఇ. కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్, చెస్, షటిల్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ, బోనఫైడ్ పత్రాలను తీసుకొని రావాలన్నారు.

ఏపీటీఎఫ్ టీచర్ల నిరసన



మార్టూరులో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఉపాధ్యాయులు

మార్టూరు: అపరిష్కృతంగా ఉన్న టీచర్ల సమస్యలను పరిష్కరించనందుకు నిరసనగా ఏపీటీఎఫ్ యూనియన్ టీచర్లు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు ఇవ్వాలని.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్ల పరిష్కారం కోసం వారం రోజుల కార్యాచరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 17వ తేదీ ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీలకు వాట్సాప్, ఇమెయిల్ ద్వారా వినతి పత్రాలను పంపించనున్నట్లు తెలిపారు.

కొండమంజులూరు పాఠశాలకు బీరువా అందజేత


పాఠశాల బీరువా అందిస్తున్న దాతలు

జె.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం కొండమంజులూరు గ్రామ పీఎస్‌సీఎస్ అధ్యక్షుడు బత్తుల వెంకట్రావు బీరువా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఐ. అనిత మాట్లాడుతూ రూ. 12 వేలు విలువ గల బీరువా అందజేశారు. దాతలకు హెచ్‌ఎం అనిత, పాఠశాల బృందం కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీగా సందిపోగు రవీంద్ర


జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ రవీంద్ర

జె.పంగులూరు: వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ విభాగ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో జిల్లా నలుమూల నుంచి 18 మందిని కమిటీ సభ్యులుగా నియమించామని తెలిపారు. కమిటీలో పంగులూరు మండలంలోని నార్నెవారి పాలెం గ్రామానికి చెందిన సందిపోగు రవీంద్ర (బుజ్జి)కి జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇప్పించిన వైవీ సుబ్బారెడ్డికి, భద్రారెడ్డికి, ఇన్‌చార్జ్ పానెం హనిమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

పాఠశాల ఆవరణ శుభ్రపరిచిన సిబ్బంది

అద్దంకి రూరల్: గురుకాయపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణను గురువారం మున్సిపల్ సిబ్బంది శుభ్ర పరిచారు. స్థానికులు ఆక్రమించుకుని పేడ దిబ్బలు వేస్తున్నారు. దీనిపై పలుమార్లు పాఠశాల హెచ్‌ఎం .. మంత్రి రవి కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం మున్సిపల్ సిబ్బంది పొక్లెయిన్‌తో స్థలాన్ని శుభ్రపరిచారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం భాద్రపద మాసం భరణి నక్షత్రం పంచమి శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అమెరికా సుంకాలపై చర్చ నేడు

అద్దంకి రూరల్: సీపీఎం పూర్వ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో వర్తమాన పరిస్థితిలో అమెరికా సుంకాలు భారతదేశంపై ప్రభావాలు అంశంపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం సీఐటీయూ, ప్రజారోగ్య వేదిక నాయకులు తంగిరా వెంకటేశ్వర్లు, కె. రఘుచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యా, కార్మిక శ్రామిక రంగాల ప్రజలు, వామపక్ష నాయకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణులు సందీప్

ఇంకొల్లు(చినగంజాం): విద్యార్థులు ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని పెంచుకోవాలని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ సందీప్ అన్నారు. నివేదిత హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని పెంచే కార్యక్రమంలో భాగంగా వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడి ఒత్తిడికి గురి కాకుండా ఉండాలని, జీవితంలో ప్రతి సవాలును ధైర్యంతో ఎదుర్కొవాలని స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని అది సాధించేందుకు కష్టపడి విజయాన్ని చేజిక్కించుకోవాలని సూచించారు. చిన్న విషయాలను భూతద్దంలో చూసుకొని ఆత్మహత్యలు చేసుకోవడం అనే నిర్ణయాలను తీసుకోకూడదని, తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను గుర్తించి మెలగాలన్నారు. విద్యార్థులు మత్తు మందులకు, మద్యం, సిగరెట్లు తాగటం, పొగాకు ఉత్పత్తులను వాడటం వంటి మొదలగు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తగిన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అంజలి, కమ్యూనిటీ హెల్త్ అధికారి కోటేశ్వరరావు, పీహెచ్‌ఎస్ సహస్ర, పాఠశాల ప్రిన్సిపాల్ వేదాద్రి, సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశలు, వైద్యసిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


నూతనంగా ఎన్నికైన చీరాల డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం

చీరాల టౌన్: చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని చీరాల డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. గురువారం చీరాల ఎంపీడీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చీరాల డివిజన్ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఎస్. శివరామకృష్ణ, బి.ఓంకార్ వ్యవహరించారు. చీరాల డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా తహసీల్దార్ గోపికృష్ణ, సహాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా రాఘవరావు, శివశ్రీను, సెక్రటరీగా పి.సురేష్ డీటీ, జాయింట్ సెక్రటరీలు భాగ్యరాజ్, రమేష్, కృష్ణతేజ, కోశాధికారిగా శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పలువురుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా మాట్లాడారు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులకు ఉన్న సమస్యలను పరిష్కరించడంతో హక్కుల సాధనకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. రెవెన్యూ ఉద్యోగులంతా ఐక్యమత్యంగా ఉండి హక్కులను సాధించుకుందామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు రెవెన్యూ ఉద్యోగులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రతినిధులు సత్యనారాయణ, స్పోర్ట్స్ సెక్రటరీ డి.అర్జున్, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలో ఉచిత శిక్షణ

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైఏ మహిళా డిగ్రీ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎం.మాధవి గురువారం తెలిపారు. జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలలు ఉచితంగా అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. మురళి తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు యువతీ యువకులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందిస్తున్నట్లు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఎం.హారిక తెలిపారు.

స్టడీ అవర్ల పరిశీలన

బల్లికురవ: విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్ కోరారు. గురువారం ఇంటర్ విద్యార్థులకు జరుగుతున్న స్టడీ అవర్లు పరిశీలించారు.

అక్రమ కేసు ఎత్తి వేయాలి

చీరాల రూరల్: న్యాయవాది కొండయ్యపై జె. పంగులూరు పోలీసులు నమోదు చేసిన కేసును ఎత్తివేయాలని గురువారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్పీ మొయిన్‌కు వినతి పత్రం అందజేశారు. రమేష్‌బాబు, మేరుగ రవికుమార్, బండ్లమూడి విజయకుమార్, ఎంవీ చలపతిరావు, కర్నేటి రవి, నాళన రాము,స్నేహ పాల్గొన్నారు.

యువతకు వివేకానంద స్ఫూర్తి అవసరం


వివేకానందునికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దుద్దుకూరు(చినగంజాం): స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కఠారి భాస్కరరావు అన్నారు. చికాగో నగరంలో స్వామి వివేకానంద 132 ఉపన్యాస దినోత్సవం పురస్కరించుకొని ఉప్పుగుండూరు స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఇంకొల్లు మండలంలోని దుద్దుకూరు ఆచార్య రంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం కఠారి భాస్కరరావు వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వివేకానంద సేవా సమితి వారు స్వామిజీ స్ఫూర్తి వచనాలతో కూడిన 4 పెద్ద ఫొటో లామినేషన్‌లను మోడల్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుల ఆర్థిక సహకారంతో బహూకరించారు. ఆర్థిక సహకారం అందించిన ఉపాధ్యాయులు మన్నెం వెంకటేశ్వరరావు,తాటిపల్లి సువర్చలాదేవి, కట్టా శిరీష,కామిశెట్టి శంకరరావు, వివేకానంద సేవా సమితి వారికి పాఠశాల సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు ఉప్పల చెంచయ్య, ఇతర సిబ్బంది, గ్రామస్తులు చెన్నుపాటి జర్దన్ పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మామిడి మొక్కలు నాటారు.

15,16వ తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్


వేటపాలెం: స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 15,16వ తేదీల్లో స్పోర్ట్స్, గేమ్స్ నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ దేవభిక్షం గురువారం తెలిపారు. 15వ తేదీన అథ్లెటిక్స్, 16వ తేదీన గేమ్స్ నిర్వహిస్తారని తెలిపారు. స్పోర్ట్స్, గేమ్స్‌లో రెండు కేటగిరీలుగా ఉంటాయన్నారు. క్రీడాకారులను 14 ఏళ్ల కేటగిరి, 17 ఏళ్ల కేటగిరి గుర్తిస్తామని తెలిపారు. ఇంటర్ మీడియెట్ విద్యార్థులను జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో ఆడే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ దీప

పర్చూరు(చినగంజాం): బాల్య వివాహాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని పర్చూరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దీప సూచించారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాల గురించి గురువారం స్థానిక శాతవాహన హైస్కూల్‌లో 8,9,10 తరగతులు విద్యార్థినులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు నేరమని, శారీరకంగా ఎదుగుదల లేని చిన్నవయస్సులో వివాహం చేసుకోవడం వలన పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ప్రాణాపాయం కూడా సంభవించవచ్చని వారికి ఆమె వివరించారు. సమాజంలో ఆడపిల్లలు గౌరవం పొందాలని, అలా కాకుండా ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారిపై పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు ముఖ్యంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని, అటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వెంటనే తెలియజేయాలని విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 నంబరుకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్ తేళ్ల వెంకట రాము, విద్యార్థునులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ ఝాన్సీ

వేటపాలెం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ టి. ఝాన్సీ పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ సమావేశంలో మిషన్ శక్తి సంకల్పంపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మహిళలు, కిశోర్ బాలికల్లో రక్తహీనత గుర్తించి వారికి పౌష్టికాహారం తీసుకోవడానికి తగిన సూచనలు సలహాలు ఇవ్వాల్సిందిగా సూచించారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి పౌష్టికాహారం సమతుల్యత గురించి కార్యకర్తలు అవగాహన పెంపొందించాలన్నారు. ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు పీసీపీఎన్ డీటీ చట్టం ఉద్దేశం గురించి వివరించారు. బాల్యవివాహాలు చేసిన వారు చట్ట ద్వారా వారి పై తీసుకొనే చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవల్లి, కుముద్వతి, శేషమ్మ, తబిత, ప్రసన్నకుమారి, శ్యామల, ఏవీ శేషమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటండి


స్కూల్ గేమ్స్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ


బల్లికురవ: స్కూల్ గేమ్స్ స్థాయిలో జరిగే అండర్ 14, 17 పోటీల్లో సత్తాతో పాఠశాలకు, మండలానికి, జిల్లాకు పేరు తేవాలని ఎంఈవో 1 శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముక్తేశ్వరం ఉన్న పాఠశాలో ఖోఖో, అథెట్లిక్స్, సోమవారం కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో వాలిబాల్ కబడీ పోటీలు జరుగుతాయని.. విజేతలైన విద్యార్థులను చీరాల డివిజన్ స్థాయికి, అక్కడ సత్తాచాటిన విద్యార్థులను బాపట్ల జిల్లా స్థాయికి అక్కడ నుంచి రాష్ట్రస్థాయి పంపుతామని ఎంఈవో వివరించారు. ఎంఈవో2 రమేష్‌బాబు, పెదఅంబడిపూడి ఉన్నత పాఠశాల పీడీ రమణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంతో మేలు


కారంచేడులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ప్రవీణ

కారంచేడు: ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నుంచి అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు వ్యవసాయ సహాయకులు ప్రవీణ అన్నారు. గురువారం కారంచేడులో ఊటుకూరి రామయ్య అనే రైతు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీఆంజనేయ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, పద్ధతులతో భూమి సారవంతంగా మారుతుందన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించడం వలన ప్రజలు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. అవకాశం ఉన్న ప్రజలు తమకు ఉన్న కొద్ది పాటి స్థలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసే కూరగాయలను పండించుకోవచ్చని సూచించారు. పచ్చిరొట్ట, కూరగాయలు, అంతర పంటలకు అవసరమైన విత్తనాలు, కిట్లు, జీవ ఉత్ప్రేరకాలు, అమృతాలు, కషాయాలు.. ఈ వ్యవసాయ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎం జె. మోహన్, మార్కెటింగ్ సర్టిఫికేషన్ ఎన్‌ఎఫ్‌ఏ బీవీ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్స్ భీమరాజు, వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జ్ శిరీష, సిబ్బంది, సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ


వరిగడ్డి, దాణాకు నగదు అందజేస్తున్న దాతలు

అద్దంకిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో పసుమర్తి రామారావు మనమరాలు బారసాల సందర్భంగా పసుమర్తి రామారావు, చుండూరి మురళీ సుధాకరరావు మిత్రులు రోటరీక్లబ్ సహకారంతో రూ. 20 వేలు విలువ గల వరిగడ్డి, పశువుల దాణాను హనిక హరిహర గోశాలకు గురువారం అందజేశారు. రోటరీ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు. సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య,తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకులు స్వామి సేవలు మరువలేనివి


ఆకురాతి రంగనాయకులు జయంతిలో మాట్లాడుతున్న చేనేత నాయకులు

చీరాల టౌన్: పద్మశాలీలకు అఖిలభారత పద్మశాలి సేవా సంఘాన్ని ఏర్పాటు చేయడంతో పాటు చేనేతల అభివృద్ధికి, సంక్షేమానికి, ఈపురుపాలెం గ్రామాభివృద్ధికి ఆకురాతి రంగనాయకులు స్వామి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని వక్తలు కొనియాడారు. అఖిల భారత పద్మశాలియ సంఘం ప్రథమ అధ్యక్షుడు ఆకురాతి రంగనాయకులు స్వామి 145వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఈపురుపాలెం మార్కెట్ వద్ద ఉన్న రంగనాయకులు విగ్రహానికి నాయకులు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా చేనేత సంఘం నేతలు మాట్లాడుతూ.. అఖిలభాతర పద్మశాలి సంఘాన్ని 1921 జూన్ 21న కడపజిల్లా పుల్లంపేటలో ఏర్పాటు చేశారన్నారు. దేశస్థాయిలో మొట్టమొదటగా ఏర్పాటు చేసిన చేనేత సంఘానికి ఆకురాతి రంగనాయకులు వ్యవస్థాపకులుగా ఉన్నారన్నారు. ఈపూరుపాలెం సర్పంచ్‌గా చాలాకాలం పనిచేసి గ్రామంలోని పేదలకు ఇళ్ల స్థలాలు అందించి చేనేతలతో పాటు ఇతర సామాజిక వర్గాలకు రంగనాయకులు అండగా నిలిచారన్నారు. ఆకురాతి రంగనాయకులు చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు సేవాభావంతో మెలగాలని సూచించారు. జెడ్పీటీసీ ఆకురాతి పద్మిని, మాజీ సర్పంచ్‌లు జి.సరోజిని, మున్సిపల్ ఆకురాతి రంగనాయకులు జయంతిలో మాట్లాడుతున్న చేనేత నాయకులు జంజనం శ్రీనివాసరావు, చేనేత నాయకులు దామర్ల శ్రీకృష్ణ, గోలి వెంకటరావు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ఎంపీడీఓ బి.శివన్నారాయణ పంచాయితీ అధికారులు, సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీఓ పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. జనావాసాల మధ్య చెత్తా చెదారాలను వేయవద్దని సూచించారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండాలంటే ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలను తీసుకుని, నివాస ప్రాంతాల్లో మురుగునీటి కుంటలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, పంచాయితీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.